# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## తిరుపతి నుంచి కాట్పాడి రైల్వే డబుల్ లైన్ కోసం భూ సేకరణ చేస్తాం : కలెక్టర్

తిరుపతి కార్పోరేషన్ , అక్టోబర్ 15 ప్రభాతవార్త:



తిరుపతి కాట్పాడి రైల్వే డబుల్ లైన్ నిర్మాణం కోసం 45 కి,మీ. చేపట్టడానికి పాకాల,చంద్రగిరి, తిరుపతి రూరల్ పరిధిలో సుమారు 37 ఎకరాలు భూ సేకరణ చేపట్ట డానికి సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ వారు వర్చువల్ విధానంలో మంగళవారం పాల్గొని సూచించగా ఆ మేరకుచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జేసి శుభం బన్సల్ కూడా వారితోపాటు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ జి. సెక్షన్ డిటి భాస్కర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తిరుమలలో జోరు వర్షం

తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:



బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తిరుపతి జిల్లాలో జోరుగా వర్షం కురుస్తోంది. తిరుమల కొండపై మంగళవారం ఉదయం నుండి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంతో ఆలయం పరిసరాలు వరదనీరు చేరింది. చలిగాలులు వీస్తున్నాయి. కొండను పూర్తిగా పొగమంచు కప్పేసింది. మంచుతో తిరుమలను,ఘాట్‌రోడ్లను కప్పేయడంతో వాహనాలు,భక్తులు దగ్గరగా వస్తేగానీ కనిపించేపరిస్థితి లేదు. గదుల నుండి భక్తులు బయటకు రావడానికి వణుకుతున్నారు. భక్తుల రద్దీ కూడా మోస్తరుగా ఉంది.

# తెరపివ్వని వాన!



శ్రీకాళహస్తిలో కురుస్తున్న వర్షం

### అధికారులు అప్రమత్తం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో అల్పపీడనంతో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిసత్యవేడు నియోజకవర్గాల్లో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే తుఫాను హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఉదయం నుంచి వర్షం ధారగా కురుస్తుంది. దాంతో జన జీవనం స్థంభించింది. లోతట్టు ప్రాంతాల్లో నీళ్ళు చేరి ఇబ్బందిగా మారింది.ఓ వైపు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి యువకుడు కావటంతో రేయింబవళ్ళు అప్రమత్తంగా ఉంటూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ బియస్ గిరికుమార్ వేకువ జామునుంచే పట్టణంలో పర్యటిస్తు చిన్న చిన్న కాలువలనుకూడా పరిశీలిస్తున్నారు. మంగళవారం ఉదయం పిట్టవారి సందులో కాలువలను పరిశీలించారు.ఓ వైపు పారిశుద్ధ్యం మరో వైపు వర్షం పరిస్థితిని గమనించుకుంటూ వెంటనే సమస్యలున్న చోట పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. శ్రీకాళహస్తి ఇరిగేషన్ సబ్‌డివిజన్‌లో 452 చెరువులున్నాయి. అన్ని రాజుల కాలంలో నిర్మించినవే. సాధారణంగా ఈ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల ద్వారా భారీ వర్షాలు కురుస్తాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సుమారు 1500 మి.మి ల వర్షపాతం నమోదౌతుంది. పదేళ్ళ క్రితం పరిస్థితి పరిశీలిస్తే 2వేల మి.మీల నమోదయ్యేది. కానీ వాతావరణంలో మార్పులో లేక ప్రకృతి కక్ష బూనిందో కానీ 'రుతుపవనాల ద్వారా' వర్షాలు ప్రశ్నార్థకమయ్యాయి. కేవలం 'తుఫాన్లు, అల్పపీడనం'పైనే ఆధారపడి చెరువులు నింపుకునే దుస్తితి చోటు చేసుకుంది. వీటి కింద సుమారు 32వేల హెక్టార్లలో పంటలు పండిస్తున్నారు. దుక్కులు దున్నుకున్న వారు విత్తనాలు వేసుకోవటానికి తటపటా యిస్తున్నారు. నార్లు వేసుకున్న వారు చినుకు జాడ కనబడకపోవటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితి ఉండగా రెండు రోజులుగా తుఫాను వర్షంతో అనందంతో పొలం పనుల్లో తలమునకలై ఉన్నారు.

## వర్షంతో స్తంభించిన జనజీవనం..చెరువుల్లో జలకళ



గొల్లకండ్రిగ వద్ద ఉద్ది పంటలో చేరిన వర్షపునీరు



పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద జలమయమైన నగరి-కనకమ్మసత్రం రోడ్డు

విజయపురం, అక్టోబరు 15 ప్రభాతవార్త:

మండలంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడ తెరపి లేని వర్షంతో జన జీవనం స్తంభించింది. మండలంలో పంట పొలాలు వరినాటు, పెసలు, ఉద్ది పంట నీట ముని గింది. వర్షం నిరంతరాయంగా కురుస్తుండడంతో పశువులు ఇంటికే పరిమితమయ్యాయి. వర్షం తీవ్రతకు చెరకు కర్మాగారాలు పర్మిట్ రద్దు చేయడంతో వర్షంలోనే చెరకు పంట తడుస్తూ ఉండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డుకిరువైపులా వర్షపునీరు వెళ్ళకపోవడంతో పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద నగరి-కనకమ్మసత్రం తారు రోడ్డు జలమయం కావడంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా వర్షం కురిసినా పెద్ద నష్టం కలగలేదని, వర్షం కొనసాగితే పంట నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

**న అప్రమత్తంగా ఉండండి - తహసీల్దార్**

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. మండలంలో లో తట్టు ప్రాంతంలో ఉన్న వారు సురక్షితమైన ప్రదేశాలకు చేరుకోవాలని సూచించారు. తుఫాను ప్రభావంతో వర్షం రెండు రోజుల పాటు ఎక్కువగా కురుస్తుందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. అత్యవసరమైతే హెల్ప్‌లైన్ నెం.9491077035ను సంప్రదించాలన్నారు.

## ఒకటే ముసురు.. వణుకు



రైస్‌మిల్లు ఎదుట నిలిచిన వర్షపు నీరు

కోట, అక్టోబర్ 15 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత రెండురోజులు నుంచి వర్షం కురుస్తోంది. మరో 24 గంటల వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. విపత్తులను ఎదుర్కొనేలా తీరప్రాంత మండలాల్లో ముం దస్తు సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటికే గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహశీల్దార్ జయజయరావు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో పాఠశాలలు, కళాశాలలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో తహశీల్దార్ జయజయ రావు, ఎంపిడిఓ వేణు, ఎంఇఓ మస్తానయ్య, ఏఓ నిరంజన్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మద్యం షాపులకు బైబై

### - ప్రైవేటు మద్యం షాపుల కోసం ఎదురుచూపులు

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

నూతన ఎక్సైజ్ పాలసీ ఖరారు కావడం, ఆ మేరకు ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు లక్కీ డిప్ నిర్వహించి ఖరారు చేయడంతో మంగళవారం రాత్రి నుండి ప్రస్తుతం వున్న ప్రభుత్వ మద్యం షాపులు తెరమరుగు కానున్నాయి. జిల్లాలో బుధ, గురువారాల నుండి ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటు చేయడానికి లక్కీ డిప్‌లో పేర్లు ఖరారైన మద్యం దుకాణ వ్యాపారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో నూతన ఎక్సైజ్ పాలసీ మేరకు 104 ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తే 2,266 మంది ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి చిత్తూరు ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం లక్కీడిప్ నిర్వహించి మద్యం దుకాణ నిర్వాహకుల పేర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఖరారు చేశారు. కొత్త మద్యం పాలసీ ప్రకారం ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానుండటంతో ఇప్పటి వరకు కొనసాగిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఎత్తివేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుండి ప్రభుత్వ మద్యం షాపులకు మద్యంను సక్రమంగా సరఫరా చేయడం లేదు. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఇది వరకు వున్న మద్యం నిల్వలను షాపు సిబ్బంది విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు మద్యం షాపులు ఖరారు అయినప్పటికీ, వీటన్నింటికీ మద్యం కేటాయింపులు పూతలపట్టు మండలం బండపల్లి సమీపంలో వున్న ఎక్సైజ్ డిపో ద్వారా జరుగాల్సి వుండటంతో ప్రైవేటు మద్యం షాపులకు మద్యం నిల్వలు రావడానికి కొంత సమయం పట్టనుంది. సాధారణంగా మద్యం షాపు ఖరారైన వెంటనే ఆ షాపు నిర్వాహకులు ఎక్సైజ్ డిపోలో సొమ్ముకు సంబంధించిన డిడి చెల్లించి అవసరమైన మేరకు స్టాక్ తీసుకెళ్ళవచ్చును. అయితే ఒకొక్క మండల పరిధిలో నాలుగు, ఐదు మద్యం షాపులు వుండటం, వీటిలో ఏ షాపు ఎక్కడ పెట్టాలనే విషయంపై లక్కీ డిప్‌లో పేర్లు ఖరారైన వ్యక్తులకు సైతం తెలియకపోవడం సమస్యగా మారింది. మండలాల పరిధిలో మంజూరైన మద్యం షాపుల యాజమానులు అందరు సిండికేట్ అయితే తప్పా ఎవరి షాపు ఎక్కడ పెట్టాలనే విషయంపై స్పష్టత రాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికీ కొన్ని మండలాల్లో మంజూరైన మద్యం షాపు ఎక్కడ పెట్టుకోవాలనే విషయంపై యాజవానులకు స్పష్టత లేకపోవడంతో లక్కీ డిప్‌లో పేర్లు వచ్చిన వారందరు కలిసి చర్చలు చేస్తూనే వున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో బుధవారం రాత్రి లేదా గురువారం నుండి కొత్త మద్యం మందు బాబులకు అందుబాటులోకి రానుంది. అయితే మద్యం ధరల విషయంపై ఇప్పటికీ ఎవరికి క్లారిటీ లేదు. తక్కువ ధర మద్యం క్వాటర్ బాటిల్ రూ.99కు లభ్యం అవుతుందని పేర్కొంటున్నప్పటికీ మిగిలిన బ్రాండ్ల మద్యం ఎంత ధరకు అమ్ముతారనే విషయంపై స్పష్టత లేదు. ఈ పరిస్థితుల్లో కొత్త మద్యం దుకాణం ఏర్పాటు అయిన అనంతరం మద్యం ధరలు ఎలా వుంటాయనే విషయంపై క్లారిటీ రానుందని పేర్కొంటున్నారు.

## నేడు అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు

### తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు

*తిరుపతి కార్పొరేషన్, చిత్తూరు అక్టోబర్ 15, ప్రభాతవార్త*

*అక్టోబర్ 16వ తేది బుధవారం తిరుపతి,చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లాల కలెక్టర్లు డా. వెంకటేశ్వర్లు, సుమిత్‌కుమార్ మంగళవారం తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో, వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికలు మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు, ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు దినంగా ప్రకటిస్తూ కలెక్టర్ సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని ఉత్తర్వులు జారీ చేసారు.*

### జిల్లాల్లో పాలనపై 'పట్టు'కు

# ఇన్‌ఛార్జి మంత్రులు

### -తిరుపతి జిల్లాకు అనగాని, చిత్తూరుజిల్లాకు మండపల్లి



తిరుపతి,అక్టోబర్ 15ప్రభాతవార్త:

ప్రభుత్వం అమలుచేసే సంక్షేమపథకాలు ప్రజలకు చేరువచేయడం...పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలను పర్యవేక్షించి, సక్రమంగా సద్వినియోగం జరిగేందుకు జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఏర్పాటై వందరోజులపైగానే కావస్తుండటంతో ప్రజలకు అవసరమైన మేరకు సేవలందించేందుకు, జిల్లా యంత్రాంగం, అధికారులు సక్రమంగా పనిచేసేందుకు వీలుగా మంత్రులకు పాలన బాధ్యతలు నిర్వర్తించేలా చూడనున్నారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాకు రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను, చిత్తూరు జిల్లాకు రాష్ట్రరవాణాశాఖామంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నియమించారు. ఈ ఇద్దరు మంత్రులు ఆయా జిల్లాల్లో ఎంపిలు, ఎమ్మెల్యేలను కలుపుకుని ప్రజాప్రతినిధులతో, అధికారులతో కలసి అభివృద్ధి పై దృష్టి కేంద్రీకరిస్తారు. అంతేగాక ప్రజల సమస్యలనుతెలుసుకుని పరిష్కరించే దిశగా పనితీరు సాగిస్తారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లతో ఈ ఇద్దరు ఇన్‌ఛార్జి మంత్రులు సమన్వయంగా సేవలందించనున్నారు. ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమితులైన అనగాని సత్యప్రసాద్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి పలువురు పార్టీ నేతలు అభినందనలు తెలిపారు.

## స్వతంత్రసిట్ 'ఫోకస్' పైనే అందరి దృష్టి !

### సిబిఐ అధికారుల దర్యాప్తుపై సర్వత్రా ఉత్కంఠ

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

దేవదేవుడు శ్రీవారి లడ్డూల తయారీలో ఇదివరకే కల్తీనెయ్యి వాడారనే బాగోతంపై నూతనంగా ఏర్పాటైన "స్వతంత్రసిట్" బృందం ఏప కోణాల్లో ఫోకస్‌చేస్తుందనే విషయం ఇప్పుడు అందరి దృష్టి పడింది. స్వతంత్రసిట్ బృందంలో ఢిల్లీకి చెందిన ఇద్దరు సిబిఐ అధికారులు, రాష్ట్రపోలీసుశాఖకు చెందిన ఇద్దరు అధికారులు(నియామకమైన ఐజి త్రిపాఠి, డిఐజి గోపీనాధజెట్టీ),కేంద్ర ఆరోగ్యభద్రత విభాగం నుండి ఒకరు ఉంటున్నారు. ఈ అధికారుల బృందం కల్తీనెయ్యిఘటనపై దర్యాప్తు ఎలా సాగుతుందనేది ఇప్పుడు ఇటు టిటిడి వర్గాల్లో అటు మార్కెటింగ్ విభాగం అధికారుల్లో ఉత్కంఠగా మారింది. ఎవరెవరినీ విచారణకు పిలుస్తారు?వారి విచారణ ఏ కోణంలో సాగుతుందనే దానిపై నెలకొన్న ఆందోళన. పవిత్రమైన దేవుని లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారనే బాగోతంపై కీలక విచారణ "స్వతంత్రసిట్" అధికారుల బృందం చేతిలో ఉంది. ఈ బృందం ఈ వారంలో



తిరుమలకు చేరుకుని కల్తీనెయ్యి బాగోతంపై విచారణ మొదలుపెడుతుందనేది సమాచారం.గతంలో ఇదేకేసులో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఐజి, డిఐజి, ఎస్పీ, డిఎస్పీలు, సిఐలు తమతమ స్థాయిలో తిరుమల,తిరుపతిలో రెండురోజుల పాటు మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళు, నెయ్యితనిఖీ చేసే పరిశోధనశాల, గిడ్డంగుల్లో విచారణ చేసిన విషయం విదితమే.అయితే సిట్ బృందం దర్యాప్తుపై కొందరు సుప్రీంకోర్టు కెళ్ళడంతో సిబిఐ చేతికి విచారణ వెళ్ళింది. ఈ స్వతంత్రసిట్ బృందం తిరుమలకు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో దర్యాప్తుకు ఇబ్బందికరమని భావించి రాలేకపోయారు. ఇప్పుడు బ్రహ్మోత్సవాలు ముగియడంతో కల్తీనెయ్యి ఘటన పై సమగ్ర మళ్ళీ విచారణకు అధికారులు సిద్ధమవుతున్నారు. గత ఐదేళ్ళలో ఎవరి ద్వారా టెండర్లు పిలిచారు, ఎంతకాలం ఎవరెవరు నెయ్యి సరఫరా చేశారనే కోణాల్లో సిబిఐ అధికారులు విచారణ చేయనున్నారని తెలుస్తోంది. 2023 జూన్ నెల నుండి2024 జూన్‌నెల వరకు టిటిడికి నెయ్యిసరఫరా చేయడానికి టెండర్లులో పాల్గొన్న సంస్థలు, సరఫరా చేసిన సంస్థలు ఉన్నవారి సమాచారంతో సిట్ విచారణకు కార్యాచరణ రూపొందించుకోనుందనేది తెలుస్తోంది.

## విజన్ డాక్యుమెంట్ తయారీలో నిపుణులచే సలహాలు

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

*తిరుపతి జిల్లా, అక్టోబర్ 15, ప్రభాతవార్త*

*స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీలో జిల్లా గ్రోత్ రేట్ 15 శాతం పైన ఉండేలా ఆచరణాత్మక జిల్లా ప్రణాళికలు తయారీలో ఐఐటి తిరుపతి, పలువురు సబ్జెక్ట్ నిష్ణాతుల సలహాలు సూచనలు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ, సబ్జెక్టు నిపుణులతో స్వర్ణాంధ్ర 2047 తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారిపై పలు అంశాలపై వర్చువల్ విధానంలో కలెక్టర్, జేసి శుభం బన్సల్, సంబంధిత అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం పలు అంశాలపై పర్యాటక, అతిథ్య రంగం, విద్యా, పరిశ్రమలు, మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్ ప్రమోహన్, ఎలక్ట్రానిక్ హబ్‌గా, ఇన్ఫ్రాస్టక్చర్ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో వారి సూచనలు ఎంతగానో దోహదపడుతాయని కలెక్టర్ తెలిపారు.*

## రీ-ఓపెన్ కాకుండా సమస్యలు పరిష్కారం

### అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందే అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు శాఖకు సంబంధించి అత్యధిక అర్జీలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు బాధ్యతతో సమస్యలను క్షేత్ర స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. ఏ సమస్య అయితే పరిష్కారం అవుతుందో ఆ సమస్యను సత్వరం పరిష్కరించాలని, పరిష్కారం కాలేని సమస్యకు సంబంధించి ఎందుకు పరిష్కారం కాలేదన్న పూర్తి సమాచారంను అర్జీ దారుడికి ఎండార్స్‌మెంట్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, హౌసింగ్ పిడి పద్మనాభం, డ్వామా పిడి రవికుమార్, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి మూర్తి, డిఎల్‌డిఎ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల బకాయిలు చెల్లింపులో కుట్ర చేస్తే

## ఫ్యాక్టరీని ముట్టడిస్తాం

నింద్ర, అక్టోబర్ 15ప్రభాతవార్త:



నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణంలో రైతులు నిరసన తెలుపుతున్న దృశ్యం

రైతులకు చెల్లించవలసిన బకాయిలలో కుట్ర చేస్తే రైతులు ముకుమ్మడిగా నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీని ముట్టడిస్తామని రైతు సంఘ నాయకులు ఆదినారాయణరెడ్డి తీవ్రంగా హెచ్చరించినారు.మంగళవారం మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీని యస్‌టిసియల్ ఫైనాన్స్ కంపెనీ వారు ఆన్‌లైన్ ద్వారా వేలం నిర్వహిస్తారని రైతులకు తెలియడంతో రైతులు ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆరు మండలాల రైతులకు 35కోట్లు,కార్మికులకు 13 కోట్లు బకాయిలు చెల్లించవలసి వుందని వాటిని చెల్లించమని గత ఐదు సంవత్సరాలుగా అనేక పర్యాయాలు అధికారులు, యాజమాన్యం,ప్రభుత్వం చుట్టు ప్రధక్షిన చేసిన ఎవరికి గానీ చీమకుట్టినట్లుగా కూడా స్పందన లేదని విమర్శించినారు.ఇలా వున్న సమయంలో ఇప్పుడు ఏకంగా యస్‌టిసియల్ ఫైనాన్స్ కంపెనీ వారు ఆన్‌లైన్ ద్వారా వేలం వేయడం,ఈవిషయాన్ని రైతులకు కనీసం తెలియజేయకుండా దాచడం యాజమాన్యం అంతర్యం ఏమిటి అని ప్రశ్నించినారు.రైతులు అనేక పర్యాయాలు ఫ్యాక్టరీ ఎదుట నిరసన,ధర్నాలు నిర్వహించినప్పుడు యాజమాన్యం కనీసం ఒక్కసారైన రైతులు భాధలు తెలుసుకుంటామని ప్రయత్నం చేసారా,ఇలా ఎవరికి తెలియకుండా వేలం వేయడం చూస్తావుంటే రైతులకు, కార్మికులకు మోసం చేయాలని ఆలోచన వచ్చినట్లు తెలుస్తుందని అన్నారు.రైతులను మోసం చేయాలని ప్రయత్నం చేస్తే ఫ్యాక్టరీని రైతులు ముక్మడిగా ముట్టడించి,రైతులు,కార్మికుల బకాయిలు చెల్లించేవరకు నిరసన తెలుపుతామని అన్నారు.యస్‌టిసియల్ ఫైనాన్స్ కంపెనీ డిజియం రైతులు మాట్లాడగా రైతులు, కార్మికులకు చెల్లించవలసిన బాకీలు చెల్లిస్తామని కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు,రైతు నాయకులు,కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గూడూరులో రౌడీయిజం అణచివేస్తాం

### డిఎస్పి వివి రమణ కుమార్

గూడూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త



గూడూరు లో రౌడీయిజం అనిచి వేస్తామని, ఆకతాయిలు అల్లరి మూకపై ఉక్కుపాదం మోపుతామని డిఎస్పి వివి రమణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణం, నియోజకవర్గంలో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా జీవించాలని అన్నారు. సైదాపురం గ్రామానికి చెందిన మైనర్ బాలుడు స్థానిక జడ్పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు చదువు మానేసి స్థానిక రెండవ పట్టణంలోని ఎన్‌కేఆర్ కళాశాల సమీపంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 20వ తేదిన ఈ బాలుడికి తిలక్ నగర్‌కు చెందిన మరో మైనర్ బాలుడికి చిన్న పాటి వివాదం జరిగింది. దీంతో గాంధీ నగర్ సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద సైదాపురంకు చెందిన మైనర్ బాలుడిని తిలక్ నగర్‌కు చెందిన మైనర్ బాలుడుతో పాటు అతని స్నేహితులు మాట్లాడాలని పిలిచి నిర్బంధించి కాళ్లు, చేతులతో దాడి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో ఫిర్యాదు ఇచ్చేందుకు సైదాపురంకు చెందిన మైనర్ బాలుడు భయపడి మంగళవారం స్థానిక రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ నిర్వహిస్తున్నామని యువత ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 16 సమస్యలు

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** ప్రజా సమస్య లను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు ప్రతి వారం నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూ లల నుండి 16 సమస్యలు వచ్చాయి. ప్రజల నుండి అందిన సమస్యలను పరిశీలించిన ఎస్పీ మణికంఠ చందోలు సత్వరం సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీ లించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికఅత్యధికంగా భూతగాదాలకు సంబంధించి 6, డబ్బు తగాదాలు 4, ఆస్తి తగాదాలు2,వేధింపులు, ఇంటి తగాదాలు, కుటుంబ తగాదాలు, దారి సమస్యలపై ఒకొక్క అర్జీ అందింది.

## వరద బాధితులకు రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం రూ.35 వేలు విరాళం

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం రిటైర్డ్ పోలీసు ఉద్యో గుల సంఘనాయకులు 35 వేల రూపాయల ఆర్థిక సహాయంనుఎస్పీ మణికంఠ చందోలును కలిసి మంగ ళవారం కలిసి అందజేశారు. జిల్లా పాత పోలీసు కా



ర్యాలయంలో మంగళవారం ఎస్పీ మణికంఠ చం దోలను రిటైర్ట్ పోలీసు ఉద్యోగుల సంఘ నేతలు, రిటైర్డ్ ఇన్స్‌పెక్టర్ ఫెడ్రిక్, ఎస్ఐ మురళీ, సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వీరు వరద బాధితుల కోసం తమ సంఘం ద్వారా 35 వేల రూపాయల చెక్కును ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఉద్యోగం చేస్తున్న సమయంలో ప్రజలకు సేవ చేస్తారని రిటైర్డ్ అయిన అనంతరం సేవ చేస్తారని మెచ్చుకున్నారు.

## వరద బాధితులకు రూ.86 వేల విరాళం

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**

విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా ఎపి ప్రధాన ఉపాధ్యాయుల సంఘం 86,100 రూపా యల విరాళం ప్రకటించింది. ఈ మేరకు సంఘ నా యకులు మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి రూ.86,100 రూపాయల చెక్కును అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు, చిత్తూరు డివైఇఓ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు అరుణ్ కుమార్,ప్రధానకార్యదర్శి రవీంద్రారెడ్డి, కోశాధికారి హేమాద్రి, రాష్ట్ర కౌన్సి లర్లు, హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

## వర్షంలో సైతం పల్లె పండుగ

**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**

వర్షంలో సైతం మండలంలో పల్లె పండుగ సంబరాలను అధికారులు ఘనంగా నిర్వహించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపిడిఓ మోహన్‌మురళీ డికె మర్రిపల్లి గ్రామంలో 5 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మోహన్‌మురళీ మాట్లాడుతూ ఉపాధి పథకంలో మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అన్ని పంచాయతీల్లో భూమి పూజ చేసి పనులను ప్రారంభించాలన్నారు.పంచాయతీ కార్యదర్శి జ్యోతినాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌భరత్, ఎపిఓ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రామ్మూర్తి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## తుఫానుతో మరింత అప్రమత్తం

**గుడిపాల, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** తుఫాను హెచ్చ రికల నేపథ్యంలో వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు మరింత అప్రమత్తంగా వుండాలని జిజెఎం ట్రస్ట్ ఛైర్మన్, ఎమ్మెల్యే గురజాల తండ్రి గురజాల చెన్నకేశ వులు నాయుడు అన్నారు. వర్షాల నేపథ్యంలో గురజా ల చెన్నకేశవులు నాయుడు మంగళవారం తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ శివరాజన్‌లతో సమావేశం



అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమ త్తంగా వుండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటుకు ట్రస్ట్ తరపున తాను పూర్తి సహాయ సహకా రాలు అందిస్తానన్నారు. దేశం నాయకులు అయ్యప్ప, సెల్వం, హేమాద్రి పాల్గొన్నారు

## ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను కలిసిన భీమినేని చిట్టిబాబు

**పాలసముద్రం, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**



జిడినెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు మంగళవారం చెన్నైలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ భీమినేని చిట్టిబాబును ఆహ్వానించి శాలువతో సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని, పార్టీకి ఎక్కడ చెడ్డపేరు కాకుండా చూడాలని ఎమ్మెల్యే భీమినేని చిట్టిబాబును కోరారు. ప్రజల మధ్యలో వుంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. 2029 ఎన్నికల్లో నియోజకవర్గంలో మరోసారి తెలుగుదేశం పార్టీ విజయం సాధించడానికి ఇప్పటి నుండి పక్కాగా ముందడుగు వేయాలని ఎమ్మెల్యే భీమినేనితో అన్నట్లు తెలిసింది.



## పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

**సదుం, అక్టోబరు 15 ప్రభాతవార్త**

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఉపసర్పంచి, వార్డు సభ్యుడు కృషి చేయాలని ఈఓఆర్‌డీ వరప్ర సాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో మండలంలోని అన్ని పంచాయతీల ఉపసర్పంచిలు, వార్డుసభ్యు లు,కార్యదర్శులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీల పరిపాలన అభివృద్ది అనే అంశంపై వారికి వివరించారు. పంచాయతీల పరిదిలో ఉన్న పరిస్తితులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అందరం బాధ్యతాయుతంగా పనిచేసి పంచాయతీల అభివృద్దికి కృషి చేయాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభలు నిర్వహించి అవసరమైన అభివృద్ది పనులను గుర్తించి పనులు చేయించుకోవాలన్నారు. ప్రజాసమస్యలైన తాగునీరు, మురుగునీరు, పారిశుద్ద్యం, వీది దీపాలు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపథకాలు గురించి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ హరిబాబు, ఏపీఓ శివశంకర్, ఎంఈఓ శ్రీరాములు,శ్రీనివాసులురెడ్డి, నాగశేషారెడ్డి, సదుం, తాటిగుంటపాలెం,రెడ్డివారిపల్లెల ఉపసర్పంచిలు బాబురెడ్డి, రామచంద్రయ్య, ఆనం దరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

**కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాప కులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ



గత ప్రభుత్వం జిఓ నెం 114 ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని చెప్పి కేవలం కాలయాపన చేసిందే తప్ప రెగ్యులర్ చేయలేదని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని వారు కోరారు.

## కెఐసిలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

**కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో దివంగత మాజీ రాష్ట్ర పతి, దేశ క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం జయం తిని ఘన ంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సి పాల్ డా॥ సుధాకర్‌బాబు అధ్వర్య ంలో కలాం చిత్రప టానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. సామాన్య కుటు ంబంలో జన్మించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు. మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచి దేశవిదేశాల్లో భారత దేశానికి కీర్తి సాధించిపెట్టారన్నారు. యువత కలాం స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్ మాట్లాడుతూ మీ అలవాట్లు మీ భవిష్యత్తును మార్చుతాయి అని అబ్దుల్ కలాం మాటలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌డి,ఇసిఇ విభాగాధిపతి డా॥ కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒలు మాధవన్, గంగాధరన్, హెచ్ఒడిలు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యం

**వి.కోట, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



గ్రామాల అభివృద్ధి ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు ఎఎం రంగనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కనమనాయనపల్లిలో పల్లె ప ండగ కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్ల నిర్మా ణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు,డి.సిఎం పవన్ కళ్యాణ్‌ల మార్గదర్శ కత్వంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. మండలానికి ఏడు కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే రెండు కోట్లతో సిసి రోడ్ల నిర్మాణాలు పూర్త య్యాయన్నారు నేతలు రాంబాబు, విశ్వనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సోమశేఖర్, ఈశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

## రైతులు మరింత అప్రమత్తం

**పాలసముద్రం, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** మండల పరిధిలో మూడు రోజుల పాటు వర్షాలు నమోదు కానుండటంతో రైతులు మరింత అప్రమత్తంగా వుండాలని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ పేర్కొన్నారు. వర్షాల ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం వుందని రైతులు అప్రమత్తంగా వుండి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే పంట పొలాల కల్లాల్లో ధాన్యం

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమిష్టి కృషితో పల్లె ప్రగతిని సాదిద్దాం : కృష్ణవేణి

**చౌడేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



సమిష్టిగా పనిచేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధిని సాదిద్దామని ఇఓఆర్‌డీ కృష్ణవేణి అన్నారు. స్థానిక పరిపాలనా భవనంలో పంచాయతీ పరిపాలనా, విధుల తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అమలు చేసే పథకాలను గురించి ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. ప్రతి 3నెలల కొకసారి గ్రామ సభలు ఏర్పాటు చేసి, గ్రామీణాభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ పరిపాలనా అంశాలను గురించి వివరించారు. మండలంలోని ఉపసర్పంచులు, వారడ్డు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వృద్ధుడి అదృశ్యం

**చౌడేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



ఇంటి నుంచి పట్టణానికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళిన వృద్దుడు కనిపించకుండా పోయిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుడు తిరుమల రాజు కథనం మేరకు...మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లికి చెందిన కొండూరు వెంకట్రాజు(73) వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో 28ఆగస్టు 2024న చౌడేపల్లికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళాడు. అనంతరం 2రోజుల తర్వాత ఢిల్లీలో వున్నానంటూ వేరొక వ్యక్తి నుంచి ఫోన్ తీసుకొని సమాచారమిచ్చి, ఇంటికి వస్తున్నానని తెలిపినట్లు ఆయన కుమారుడు కొండూరు తిరుమలరాజు తెలిపాడు. అయితే ఇప్పటి వరకు తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదని వాపోయాడు. ఈమేరకు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తిరుమలరాజు తెలిపాడు. తన భర్త కనిపించలేదన్న బెంగతో తల్లి మంచాన పడిందనీ, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 7483007414నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. వారికి తగిన పారితోషికం అందిస్తామన్నారు.

## విధులలో అప్రమత్తంగా ఉండాలి: కమీషనర్

**పుంగనూరు, అక్టోబరు 15 ప్రభాతవార్త :**



మున్సిపల్ ఉద్యోగులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాల కారణంగా పట్టణంలో నిర్వహించే శానిటరీ స్పెషల్‌డ్రైవ్‌కు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమీషనర్ మదుసూదన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. వీధులు,పొంగిపోయే అవకాశమున్న కాల్వల వద్ద చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఉద్యోగ,శానిటరీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న 48 గంటలు ఎక్కువగా వర్షపాత అవకాశం ఉన్నందున కలెక్టర్ ఆదేశాలతో ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉండాలని, అవసరమైన చర ్యలకు తక్షణం స్పందించే విధంగా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. వీదురుగాలులు అధికంగా వీచే అవకాశం ఉన్నందున పట్టణంలో కటౌట్‌లను తొలగించే కార్యక్రమాలు పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. అదేవిధంగా పడిపోయి ప్రమాదం సంభవించే అవకాశం ఉన్న వీధుల విద్యుత్ స్తంభాలు, విద్యుత్‌తీగల విషయాలను కూడా గుర్తించి చర్యలు చేపట్టేందుకు ఆయా వార్డులలో సమాచారాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు అందచేస్తామన్నారు. కార్యక్రమాలలో అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**పుంగనూరు, అక్టోబరు 15 ప్రభాతవార్త :**



ఏపిజె అబ్దుల్ కలా ట్రస్టు సభ్యుల అధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం రోగు లకు బ్రెడ్,పండ్లు పంపిణీ కార్యక్రమంను అధ్యక్షు డు అయూబ్‌ఖాన్ అధ్వర్యంలో నిర్వహించారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా జరిగిన ఈకార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ కలాం సేవలు మరువ లేనివన్నారు. విద్య,వైద్యానికి సంబంధించి పలుసేవా కార్యక్రమాలు ట్రస్టు అధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు,వైద్యులు పాల్గొనా ్నరు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పల్లె పండుగలో రూ.36 లక్షలతో అభివృద్ధి పనులు

**బాలాయపల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 36 లక్షల రూ పాయిలతో ఉపాధి హామీ పథకం పనులను గ్రామాల్లో చేపడుతున్నట్లు ఎంపిడిఓ డీజే వినీల్ కుమార్ తెలిపారు. మండలంలోని అలిమిలి, గొట్టికాడు, మన్నూరు మిట్ట, పల్లిపాడు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పండుగ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసినట్లు చెప్పారు. సిసి రోడ్లు తదితర పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈవోపిఆర్డి మోహన్ రాజు, టిడిపి నేత రఘు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**వెంకటగిరి, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

తుఫాను సహాయక చర్యల కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అధికా రులు తెలిపారు. 17వ తేది వరకు సహాయ చర్యలు చేపట్టేందుకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా టీమును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 0865 - 295015 ఫోన్ నెంబర్‌కు విపత్తుల సంభవిం చినప్పుడు సమాచారం ఇస్తే సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. అందరూ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలన

**వాకాడు, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



వాకాడు మండలం తూపిలిపాలెంలోని ఏర్పాటు చేసిన సైక్లోన్ పునరావాస కేంద్రాలను ఎంపిడివో అన్నపూ ర్ణారావు పరిశీలించారు. మంగళవారం వాకాడు మండ లం తూపిలిపాలెం సముద్రం ముఖ ద్వారం వద్ద నివసిస్తున్న గిరిజన కుటుంబాలతో ఎంపిడివో మాట్లాడి తుఫాన్ పునరావాస కేంద్రానికి ముందస్తుగా తరలించారు. సముద్ర తీరాన నివసిస్తున్న పసిపిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఎంపిడివో తల్లిదండ్రులకు సూచించి అవగాహన కల్పించారు. సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఆయన సూచించారు. ఆయన వెంట ఈవోపిఆర్డి ఉమామహేశ్వర రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పొలం పిలుస్తుంది సద్వినియోగం చేసుకోవాలి

**వాకాడు, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాకాడు వ్యవసాయ శాఖ అధికారిని దీప తెలిపారు. మంగళవారం మండలంలోని కల్లూరు, జువ్వినట్టు పంచాయితీలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వ హించారు.ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి వలన కలు గు ప్రయోజనాలు, సీజన్‌లో నారుమడి, బీజామృతంతో విత్తన శుద్ధి, ఎరువుల వలన కలుగు ప్రయోజ నాలు గురించి వివరించారు. పశువులు, గొర్రెలు, మేకలు సీజనల్ వ్యాదుల నివారణ, మత్స్యకారు పథకాలు, రాయితీలు గురించి పశు సంవర్ధక శాఖ సిబ్బంది రమేష్ మాట్లాడారు.సర్పంచ్‌లు భాస్కర్ రెడ్డి, సిద్ధారెడ్డి మదుసూధన్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 94 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 94 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సిడిపిఓ మునికుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 94 అంగన్‌వాడీ కేంద్రాలకు మంచినీటి పథకాలు, మరుగుదొడ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ పనులు చేయించేందుకు కసరత్తు ప్రారంభించారని తెలిపారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు మంచినీటి సమస్య తొలగిపోతుందన్నారు.

## ఎడతెరపు లేని వర్షం

**దొరవారిసత్రం, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం భారీ వర్షాలు ఆ పై తుఫానుగా మారి కాలవలు, వాగులు, వంకలు, చెరువులు వర్షపు నీరు చేరి నిండాయి. దొరవారిసత్రం మండల పరిధిలోని కటవపల్లి, పూల తోట, సింగనల్లటూరు, కల్లూరు, కల్లూరు కండ్రిగ తదితర గ్రామాల్లో మూడు రోజుల నుంచి ఎడతెరపు లేకుండా వర్షం కురుస్తుండడంతో ఆయా గ్రామాల్లో వున్న చెరువులు నిండాయి. దీనికి తోడు రైతులు వేసిన వరి పంటకు ఈ వర్షపు నీరు చేయడంతో పంటలు కూడా పుష్కలంగా పెరుగుతున్నాయని పల వురు అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - ఆర్డీఓ

**సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



తుపాను ప్రభావంతో రానున్న రెండురోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మ యి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కా ర్యాలయ సమావేశ మందిరంలో తుపాను అత్యవసర సమావేశాన్ని ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. అధికారులందరూ తమకు కేటాయిం చిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆమె కోరారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు, తహశీల్దార్ నరసింహారావు, సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే సూళ్లూరుపేట మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జనజీవనం ఇప్పటికే పూర్తిగా స్తంభించింది. రోడ్లపై వర్షపు నీరు ఏరులై పారుతోంది.

## వర్షపు నీరు మళ్లింపు

'వార్త'కు స్పందన

**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

వర్షం వస్తే కోటలోని రవినగర్ కాలనీ ప్రజలు ముంపునకు గురవుతున్నారని 'వానొస్తే రవినగర్ ప్రజలకు వణుకు' అనే శీర్షికతో 'వార్త' దినపత్రికలో కథనం వచ్చింది. దీంతో అధికారులు స్పందించారు. ఎంపిడిఓ వేణు..కార్యదర్శి రాజశేఖర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రవినగర్‌లో రోడ్లపై వర్షపు నీటిని తొలగిం చాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ రాజశేఖర్ తన సిబ్బందితో రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని దారి మళ్లించారు.

## కలెక్టరేట్‌కు ఫోన్..

– పరుగులు తీసిన అధికారులు



**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

తుపాను, భారీ వర్షాల హెచ్చ రికల నేపథ్యంలో గత రెండు రోజులు నుంచి వర్షాలు కురుస్తు న్నాయి. మరోపక్క అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధి లోని జంగిటివానిదిబ్బ గ్రామస్థు లు జిల్లా కలెక్టరేట్‌కు ఫోన్ కాల్ చేసి సమాచారం అందించారు. గతంలో పడిన బకింగ్ హామ్ గండ్లు కారణంగా కట్ట బలహీనంగా ఉందని, ఏ మాత్రం వరద వచ్చినా జంగిటివానిదిబ్బ ముంపునకు గురవుతుందని ఆ గ్రామస్థులు కలెక్టరేట్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. కలెక్టరేట్ అధికారులు కోట తహశీల్దార్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో తహశీల్దార్ జయజయరావు జంగిటివానిదిబ్బకు నీటిపారుదల శాఖ ఇంజినీర్లను తీసుకెళ్లి పరిశీలించారు. గ్రామస్థులకు ధైర్యం చెప్పారు.

## కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త**



రెండురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సెలవులు ప్రకటించారు. ఆ మేరకు కలెక్టర్ ఆదేశాలను అందరూ పాటించాలని కోరారు. అయితే కోట లోని శ్రీచైతన్య ఇంగ్లీష్ స్కూలు యాజమాన్యం మంగ ళవారం తరగతులు నిర్వహించింది. సమాచారం తెలుసు కున్న తహశీల్దార్ జయజయరావు, ఎంఇఓ మస్తానయ్య, ఎంపిడిఓ వేణు ఆ స్కూలుకు వెళ్లి వర్షాల సమయంలో విద్యార్థులను ఎలా రప్పిస్తారని ప్రశ్నించారు. వెంటనే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆదేశించారు. ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు. దీంతో జోరు వర్షంలో విద్యార్థులు తడుస్తూ ఇళ్లకు వెళ్లారు.

## చిట్టమూరులో 64.4 మిల్లీమీటర్ల వర్షం

**చిట్టమూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

చిట్టమూరు మండలంలో భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం 64.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ ఐవి ప్రసాద్ తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో తుపాను ప్రభావం నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో రానున్న రెండురోజుల భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పరిశీలన అనంతరం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ అవసరమైన మందులను నిల్వ ఉంచామని తెలిపారు. ముఖ్యంగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా గుర్తించామని, అవసరమైన మేరకు ప్రజలను తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ప్రజలందరు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా మెలగాలని సూచించారు.

## ముప్పు ప్రాంతాలను పరిశీలించిన నియోజకవర్గ సైక్లోన్ ప్రత్యేకాధికారి

**దొరవారిసత్రం, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



పులికాట్ తీర ప్రాంతాలైన వేలుకా డు, కారు కాడు, మీజూరు గ్రామాల ను మంగళవారం నియోజకవర్గ సైక్లోన్ ప్రత్యేకాధికారి పిడి డిఆర్ డిఏ శోభన్ బాబు సందర్శించారు. తుఫాను ప్రభావం దొరవారిసత్రం మండల పరిధిలోని వేలుకాడు, కారుకాడు, మీజూరు, బురద మడుగు, వేదగిరిపాలెం, తనయాలి తదితర గ్రామాల్లో వరద ముప్పు ఉంటుందని, ఆ ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. వీరితో పాటు తహశీల్దార్ శైల కుమారి, ఎస్ఐ అజయ్ కుమార్, మండల శాఖ అధికారులు ఉన్నారు.

## డివి సత్రంలో పలు గ్రామాల్లో కరెంట్ కట్

అవస్థలు పడుతున్న గ్రామస్తులు

**దొరవారిసత్రం, అక్టోబర్ 15, ప్రభాతవార్త**

దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు, కుప్పారెడ్డి పాల్యెం తదితర గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సుమారు సోమవారం అర్ధరాత్రి నుండి మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా విద్యుత్ లేకపోవడంతో గ్రామస్తులు తాగు నీరు కోసం అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఓ వైపు అకాల ఈదురుగాలి వర్షం మరో వైపు చిమ్మ చీకటి నడుమున వృద్ధులు, పిల్లలు నానా తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

## రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి

– ఏఓ కవిత



**సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట మండలం ఆబాక, సామంతుమల్లాం తది తర గ్రామాల్లో రైతులు ప్రస్తుతం బిపిటి 5204 నార్లను పోసి ఉన్నారని, వాటిని అగ్గి తెగులు బారిన పడకుండా కాపాడుకునేందుకు ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధి కారి ఎన్.కవిత కోరారు. మంగళవారం ఆబాక, సామంతుమల్లాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో ఆమె పాల్గొన్నారు. ప్రస్తుతం పోసి ఉన్న నార్లకు అగ్గి తెగులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఒక ఎకరం వరి పొలానికి మూడు బస్తాలు సూపర్ పాస్ఫేట్ దుక్కిలో వేసి వారంరోజులు తర్వాత నార్లు వేయాలన్నారు. ఒక బస్తా డిఎపి 25 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేసుకొని పదిరోజులకు ఒకసారి 20 కేజీల యూరియాను నాలుగు దఫాలుగా వేసుకోవాలని సూచించారు. చివరి కోటాలో 15 కేజీల పొటాష్‌ను కలిపి చల్లుకొని ఎరువుల యాజమాన్యం పాటిస్తే కొంత వరకు అగ్గి తెగులు నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తుమ్మా శారద, చిట్టేటి శివకుమార్, హిమబిందు, పశు సంవర్ధకశాఖ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 15 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు

**వెంకటగిరి, అక్టోబర్ 15, ప్రభాతవార్త** పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లో విరివిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపిపి తమ్మిరెడ్డి తనుజ రెడ్డి తెలిపారు. పల్లె పండుగ గ్రామ పంచాయితీ వారోత్సవాలు భాగంగా సోమసాని గుంట గ్రామ పంచాయితీ నందు 15 లక్షలు సిసి రోడ్స్ నిర్మాణమునకు ఎంపిపి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పండ్లు ద్వారా సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు మహర్దశ వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కెవి కోటేశ్వర రావు, ఉపాధి హామీ పథకం ఏపివో దీప, సోమసాని గుంట గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ



గంజి మాధవయ్య

**పుత్తూరు, అక్టోబరు 15 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలన లో గ్రామీణ ప్రాంతాలకు మహర్ధశ పడుతోం దని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య తెలిపారు. రూరల్ మండలం పరిధి తడుకు పంచాయతీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ మంజూరు చేయించిన నిధులు రూ. 40 లక్షల్లో భాగంగా వేణుగోపాలపురం గ్రామంలో రూ. 4.50 లక్షలతో నిర్మించినున్న సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌లు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం అభివృద్ధికి తాను కట్టుబడి వున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అంజేరయ్య, ఉపాధి హామీ పథకం ఎపిఒ భార్గవి, తడుకు సర్పంచ్ పాశం వెంకటేష్, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కరుణ యాదవ్, మాజీ ఎంపిటిసిలు ఆది మండడి, కోట గజపతి తదితర ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సామీ! మా రోడ్డు దుస్థితిని గుర్తించండి!!

### బురదలో ఏళ్ళు గా జారుతున్నాము!!!



**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త** 'సామీ! ఏళ్ళు తరబడి బురద రోడ్డులో జారుతూ పడుతూ లేస్తూ గ్రామానికి చేరుకుంటున్నాము. దయచేసి మాకు రోడ్డు మంజూరు చేసి పుణ్యం కట్టుకోండని శ్రీకాళహస్తి మండలంలోని వేదాం గ్రామ ప్రజలు అభ్యర్థించారు. మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమాల్లో భాగంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పర్యటించగా గ్రామస్థులు రోడ్డు దుస్థితిని వివరించారు. ఈరోడ్డులో గ్రామానికి వచ్చిన సుధీర్‌రెడ్డి కూడా అధికారులతో వెంటనే రోడ్డు నిర్మాణానికి అంచనా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ గ్రామం ప్రజలు తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజారిటి అందించారు. దాంతో ఇక్కడి ప్రజలు గ్రామానికి రోడ్డు సదుపాయాన్ని కోరుతున్నారు. గ్రామంలో రూ. పది లక్షలతో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలను ఏర్పాటుకు భూమి పూజలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ గ్రామ ప్రజలు శాసనసభ్యునికి ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. బాణసంచాతో దద్దరిల్లజేసారు. పూల వర్షం కురిపించారు. గ్రామానికి అధ్వాన్నంగా ఉన్న రోడ్డుతో పాటు గ్రామంలోని ప్రతి వీధికి సిమెంటురోడ్డును నిర్మించాలని చెరువు పరిస్థితి దారుణంగా చెరువుకు ప్రమాదం ఏర్పడితే ఒరవ కాలువతో దాటలేమని ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమాలను పార్టీ నాయకుడు దొరైరాజ్, మధు, గోవిందరాజులు సారధ్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఎంఎల్ఏ తో పాటు మండల నాయకులు చెంచయ్యనాయుడు, కామేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ళు నలుగురు అరెస్టు

**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండలం అమ్మచెరువు పొలిమేరల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులో తీసుకున్నట్లు రూరల్‌ఎస్ఐ నరసింహారావు తెలిపారు. మంగళవారం ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లువివరించారు. ముందుగాఅందినసమాచారంమేరకు అమ్మచెరువు గట్టుమీద పేకాట జరుగుతుందని తెలుసుకొని ఆకస్మికంగా దాడి జరిపామన్నారు. ఈ దాడిలో రూ. 3200 నగదు, బైక్‌లు నాలుగు, సెల్‌పోన్లు 4 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## నేడు ఉంజల్‌సేవ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి కోట మండపం వద్ద స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవను నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ ఎస్ ఎస్‌చంద్రశేఖర్ ఆజాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఊంజల్‌సేవను నిర్వహించే సంప్రదాయం ఉందని ఈ మేరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కాగా బుధవారం రాత్రి గిరి ప్రదక్షిణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాల్సిందే

### ఎంపిడిఓ, తహశీల్దార్‌లు



**తొట్టంబేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త** మండలంలోని అధికారులందరు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఓ సురేష్‌బాబు, తహశీల్దార్ మధుసూధన్‌లు తెలి పారు. ఈసందర్భంగా తహశీల్దార్ మధుసూధనరావు మా ట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ప్రతి ఒక్క అధికారి కార్యాలయంలోనే ఉన్నారని విఆర్‌ఓలు కూడా ఉన్నారని ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేద న్నారు. ఇక ఎంపిడిఓ సురేష్‌బాబు మాట్లాడుతూ పెద్దకన్నలి చెరువును పరిశీలించడంతో పాటు బసవ య్యపాళెం, సాంబయ్యపాళెం, చిన్నసింగమాల, రౌతుసూరమాల, తొట్టంబేడు సచివాలయాలను సంద ర్శించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలుసూచనలు సలహాలు ఇచ్చారు. నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉండాలని గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో రోడ్లపై ఎక్కడా నీరు నిల్వలేకుండా ఉండాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆరోగ్య కేంద్ర సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటికి మందులను పంపిణీచేయాలని, చిన్నారులు ఎవరైనా ఉంటే వారికి దగ్గు, జ్వరం, జలుబు రాకుండా సిరప్‌లు పంపిణీచేయాలని తొట్టంబేడు, కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు సంబందింత సిబ్బందికి సూచించారు. మండలంలో ఉన్న చెరువులనుకూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సంబందిత ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు

## షిరిడిసాయి జీవసమాధి దినోత్సవ సందర్భంగా అన్నదానం



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త** షిరిడి సాయి నాధుని 106వ జీవసమాధి దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గురువారం కొత్తపేటలోని రామాలయం వద్ద సాయినాధుని చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోలా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సాయినాధుడు జీవసమాధి పొంది 106 సంవత్సరాలైందని శ్రీకాళహస్తిలోని షిరిడిసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కోరిన కోర్కెటలు తీర్చే సాయినాధుడు ఎల్లవేళలా తన భక్తులకు తోడుంటారన్నారు. కార్యక్రమంలో కోలా. ఆనంద్‌తో పాటు, పట్టణ బిజెపి అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు, గుప్తా మెడికల్స్ అధినేత రాముగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## 23న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

కాణిపాకం, అక్టోబర్ 15 ప్రభాతవార్త కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక పాల్గొనాలని తెలిపారు.

## పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ

### -పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



**ఐరాల, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పల్లెపం దుగ వారోత్సవాల కార్యక్రమం ద్వారా గ్రామాలకు మహర్ధశ కలుగనుం దని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల కార్యక్రమంను మండలంలోని పొలకల గ్రామ పంచాయతీలో మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భం గా పొలకల గ్రామపంచాయతీలో 4.40 లక్షల రూపాయల వ్యయ అంచనాలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజి పనులకు భూమిపూజ ప్రారంభించారు. అలాగే మొరంపల్లెలో 3,50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, 35 యర్లంపల్లెలో మూడు లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, పుత్రమద్దిలో రెండు లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, బొమ్మసముద్రం గ్రామంలో నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్, రాజన్, మండల అధ్యక్షుడు గిరిధర్ బాబు, జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, ఉపాధి పీడీ రవి, ఏపీడీ సుబ్రమణ్యం, డిఎల్‌డీఓ రవికు మార్, ఎంపీడీఓ ధనలక్ష్మీ, తహశీల్దార్ మహేష్ కుమార్, ఏపీఓ సంధ్యారాణి, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ లత, టీడీపీ నాయకులు హరిబాబు నాయుడు, చంద్ర మౌళి, రమేష్‌నాయుడు, రవినాయుడు, ధరణినాయుడులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పాకాలలో యదేచ్ఛగా కాలం చెల్లిన తినుబండారాల అమ్మకాలు



**పాకాల, అక్టోబర్ 15, ప్రభాతవార్త** పాకాల మండల కేంద్రం, పరిసర ప్రాంతాలలో చిల్లర దుకాణాలు నిర్వహిస్తున్న యజమానులు పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో కాలం చెల్లిన చాక్లెట్లు, బిస్కెట్లు పలు రకాల తిను బండారాలను ఏజెంట్ల ద్వారా ఇక్కడికి దిగుమతి చేసుకొని పల్లెలలో అమాయక పిల్లలు, చదువు లేని పెద్దలకి అమ్మేస్తున్నారు. రద్దీగా ఉండే బస్టాండ్ రైల్వేస్టేషన్ ముందు ఈ దందా చాప కింద నీరులా సాగిపో తోంది. ప్రజలు ఇదేంటి అని ప్రశ్నించగా నీకు వద్దక పోతే వదిలై ఇంకొకరు కొంటారులే అని, షాపు యజమానుల నుంచి ఇలాంటి నిర్లక్ష్య పు సమాధానాలు వస్తున్నాయి. బేకరీలు స్వీటు స్టాల్‌లలో వాడే నెయ్యి నాణ్యతలో చాలా అనుమానాలు కలుగుతున్నాయి అని ప్రజలు అంటున్నారు. మండల పరిధిలో అలాగే పలు రకాల ఫుడ్ కోర్ట్, టిఫిన్ సెంటర్, పానీపూరి, హోటల్స్, ఐస్ క్రీమ్ పార్లర్ సరైన నాణ్యత ప్రమాణాలు తుంగలో తొక్కి నాసిరకం, సరుకును యదేచ్ఛగా విక్రయిస్తున్నారు. సేల్ కాకుండా ఆగిపోయిన హాఫ్ బోయిల్ తాజా పోకోడా అని అమ్మే స్తున్నారు. వీటిని తినడం వలన ప్రజలు దీర్ఘకాలికంగా అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్య నిపుణులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. పాకాల మండలంలో చాలా కాలంగా సానిటరీ ఇన్స్పెక్టర్ లేని కారణంగా పలు రకాల షాపులపై పర్యవేక్షణ కొరవడి వ్యాపారదారులు విచ్చల విడిగా ప్రజలు ఆరోగ్యాలుపణంగాపెట్టిడబ్బులుదోచేస్తున్నారు. దీనిపైఉన్నతాధికారులుస్పందించిపరిస్థితి చక్కదిద్దవ ల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

## నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ



**తిరుపతిరూరల్, అక్టోబర్15 ప్రభాతవార్త:** సమగ్రశిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ముత్యాలరెడ్డి ప్రాథమిక పాఠశాలలో 'నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు'పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పాఠశాలలో చదువులో వెనకబడిన విద్యార్థులను ఎవరైతే ఉన్నారోవారిలో అభ్యసనకు సంబంధించి ఐదు రకాల లోపాలు ఉంటాయని ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు వి.సుభాషిణి తెలిపారు. అభ్యసన వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దుకోవచ్చునని విద్యార్థులకు తెలియజేసారు. అభ్యాస వైకల్యంపపై అధైర్యపడవద్దని సూచించారు. మండల విద్యాధికారి ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ, భవిత సెంటర్ సమిత విద్యా ఉపాధ్యాయులు, ఏడబ్ల్యుబ్లు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

## అన్నదానం చేయటం మహాభాగ్యం

### -ప్రతాప్ స్వామిజీ



**తిరుపతిరూరల్, అక్టోబర్15 ప్రభాతవార్త:**

పెరటాసి మాసం పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన వచ్చే తమిళనాడు భక్తులకు అన్న దానం చేయటం మహ భాగ్యమని ప్రతాప్ స్వామిజీ అన్నారు. మంగళవారం తిరుచానూరు కెఎస్ఆర్ కళ్యాణ మండపంలో శ్రీప్రతాప్ స్వామిజీ ఆశీస్సులతో ఏకవార ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాలినడకన వచ్చే భక్తులకు మధ్యాహన్నం భోజనంతో పాటు రాత్రి అల్పాహారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండె చెంగారెడ్డి, వాసు, బ్రహ్మనందం, జేజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులే రాజులు - సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి



**రేణిగుంట, అక్టోబరు 15 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య భారతదేశంలో రైతులే అన్నదాతలని రైతు లేని దేశా న్ని ఊహించుకోలేమని సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ పంచా యతీ కార్యాలయంలో ఈ క్రాప్ నమోదుపై గ్రామసభ జరిగింది. గ్రామసభలో దాదాపు 46 ఎకరాల పంటలను ఈ క్రాప్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మిపతిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు ఈ క్రాప్‌లో తమ పంటలను నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు పంటను కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందన్నారు. రైతు భరోసా, ప్రభుత్వం ద్వారా లభించే అన్ని పథకాలు రైతులకు అందుతాయన్నారు. గ్రామసభలో అగ్రికల్చర్ ఆఫీసర్ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో 46.40 మి.మీ వర్షపాతం నమోదు

**కేవీబీ పురం, అక్టోబరు 15 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన కేవీబీ పురంలో మంగళవారం ఉదయానికి 46.40 మి.మీ వర్షపాతం నమోదైందని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మునిరత్నం తెలిపారు. మండలంలో వర్షపాతం కారణంగా ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రతి పంచాయతీ సచివాలయాల పరిధిలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా లోతట్టు ప్రాంతాలవారికి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో కూడా షెల్టర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు కంట్రోల్ పాయింట్‌ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ పాయింట్ ప్రజలకు అందుబాటులో సెల్ నెంబరు ఏర్పాటు చేసి తుఫాను ప్రభావంతో గ్రామాల్లో ఏదైనా ఇబ్బంది వస్తే ఫోన్ ద్వారా తెలియజేస్తే వెంటనే రెవెన్యూశాఖ ద్వారా తగు సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ మునిరత్నం, వీఆర్‌వోలు కార్యాలయంలో రాత్రుల్లో కూడా బస చేస్తున్నట్లు, 17వతేదీ వరకు ఇన్‌చార్జి తహసీల్దార్ అక్కడే కార్యాలయంలో ఆయన నిద్రిస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ పాయింట్ సెల్ నెం. 9966144049లకు సంప్రదించాలన్నారు. మండల అధికారి మల్లి, వీఆర్‌వో మునిగోపాల్, పంచాయతీ సెక్రటరీ గోవిందస్వామి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

**కేవీబీ పురం, అక్టోబరు 15 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలం బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని కోవనూరు సెక్టార్ సూపర్‌వైజర్ సుమతి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిచ్చి మొక్కలు ఉండడంతో రావడానికి ఇబ్బందికరంగా ఉందని, వెంటనే పిచ్చి మొక్కలను తీయించాలని, అంగన్‌వాడీ కార్యకర్త గంగాదేవి, సహాయకురాలు అరుణలకు తెలిపారు. వారు గ్రామ సర్పంచ్, గ్రామ నాయకులకు తెలపడంతో అంగన్‌వాడీ కేంద్రం లోపల, వెలుపల ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలను తొలగించి, శుభ్రం చేయించారు. బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ రవి, నాయకులు విజయకుమార్ నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## యస్వీయూలో యం.టెక్,యం.ఫార్మసీ,బి.ఫార్మసీ కోర్సులకి అడ్మిషన్లు

**తిరుపతి విద్య, అక్టోబర్ 15, ప్రభాతవార్త:**

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ఇంజనీరింగ్లో యం.టెక్ కోర్సు (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్) యస్వీయూ ఫార్మసీ కళాశాలలో యం.ఫార్మసీ, బి.ఫార్మసీ కోర్సులలో ప్రత్యేక ఫీజు చెల్లింపు సీట్లతో చేరదలచిన విద్యార్థులు 21-10-2024 వరకు అప్లై చేసుకోవచ్చని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం.భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేటగరి కింద యం.టెక్.లో చేరడానికి గేట్-2024 మొదటి ప్రాధాన్యత, ఏ.పి.పి.జి ఈ సెట్ -2024 రెండవ ప్రాధాన్యత, కేవలం బి.టెక్ వారికి చివరి ప్రాధాన్యత అడ్మిషన్లలో ఇవ్వబడుతుందని వారు చెప్పారు. అలాగే యం.ఫార్మసీ కోర్సులో చేరడానికి జీ ఫ్యాట్ 2024 వారికి మొదటి ప్రాధాన్యత, ఏ.పి.పి.జి ఈ సెట్ 2024 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, కేవలం బి.ఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అదే విధంగా బి.ఫార్మసీ లో చేరడానికి ఈ.ఏ.వి.సెట్ -2024 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియట్(యం.పీ.సీ, మై.పీ.సీ) చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. యం.టెక్. కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1,42,980 రూపాయలు యం.ఫార్మసీ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1,53,940 రూపాయలు చెల్లించవలసి ఉంటుందని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ..యస్వీయూయునివర్సిటీ .ఇడియా.ఇన్/డిఓఏ వెబ్సైట్ చూడవచ్చని తెలియజేశారు. ఈ అడ్మిషన్ ప్రక్రియ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ డి.ఓ.ఏ చేపడుతుందని తెలిపారు

## పుత్తూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పుత్తూరురూరల్, అక్టోబరు 15 ప్రభాతవార్త:**

ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో పుత్తూరు మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రమేష్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అంతేకాకుండా వర్షం ఎక్కువగా ఉండడంతో ఇళ్ళలోనే సురక్షితంగా ఉండాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే సమాచారం తెలియజేయాలని ఆయన కోరారు.

## ఎడతెరపి లేని వర్షం

**నగరి, అక్టోబరు 15 ప్రభాతవార్త:**



తుఫాను ప్రభావంతో రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఎడతెరపి లేకుండా మంగళవారమంతా కురిసింది. వాతావరణంలో చల్లదనం చోటు చేసుకుంది. రెయిన్‌కోట్, గొడుగు లేనిదే బయటకు వెళ్ళలేని పరిస్థితినెలకొంది. దీంతో జన జీవనం ఇంటికే పరిమితైంది. సాయంత్రం వరకు నగరిలో 21.4, నింద్రలో 17.2 మి.మీల వర్షపాతం నమోదైంది. లో తట్టు ప్రాంతాలు జలమయమైంది. మట్టి రోడ్లన్ని చిత్తడిగా మారింది. పంట పొలాలపై నీరు చేరింది. ఖాళీ స్థలాన్నీ వర్షపు నీటితో దర్శనమిచ్చింది. తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి, వీఆర్‌వోలు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది లింగీసుగుంట, నగరిపేట బీసీ కాలనీ, కశింమిట్ట యానాది కాలనీల్లో పర్యటించారు. తుఫాను ప్రభావం ఉండడంతో ముందస్తు జాగ్రత్తగా అక్కడ నివశించే ప్రజలకు సూచనలు ఇచ్చారు. ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించాలంటూ ఫోన్ నెంబర్లు అందజేశారు.

## నామ మాత్రంగా వార్డు సభ్యుల శిక్షణ

**విజయపురం, అక్టోబరు 15 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు వార్డు సభ్యులకు నిర్వహించాల్సిన శిక్షణను మంగళవారం ఎంపీడీవో రమణప్రకాష్ ప్రారంభించారు. ఎడ తెరపి లేని వర్షం, వార్డు సభ్యులకు సరైన సమాచారం అందకపోవడంతో శిక్షణ సమావేశం నామ మాత్రంగా నిర్వహించారు. శిక్షణకు మండలంలోని 25 పంచాయతీల నుంచి పంచాయతీకి ఇద్దరు వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్ మొత్తం 75 మంది హాజరు కావాల్సి ఉంటుంది. కానీ శిక్షణకఉ 9 మంది హాజరు కావడంతో శిక్షణ సమావేశం తూతూ మంత్రంగా ముగించేశారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా జూడో పోటీలు ప్రారంభించిన శ్యామ్ సుందర్, ఆదినారాయణ రావులు



**తిరుపతి క్రీడ, అక్టోబర్ 15, ప్రభాతవార్త** స్కూల్ గేమ్స్ అండర్ 17 చిత్తూరు జిల్లా జూడో పోటీలను ఎన్ఆర్ఐ తుటుకూరి శ్యామ్ సుందర్, పిలిప్స్ కంపెనీ అనెలిటిక్స్ లీడర్ ఆదినారాయణ రావు, సివిల్ ఇంజ నీర్ ప్రమ్‌చెంద్‌లు ముఖ్య అతిథులుగా ప్రారంభిం చారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జట్టు ఎంపిక డిఎస్‌ఏ జూడో కోచ్ గోపి, పిడి చంద్రశేఖర్ రాజు, పిడి రేఖారాణిల పర్యవేక్షణలో ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఈ నెల 20, 21న శ్రీకాళహస్తిలో జరుగు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి పిడి బాబు అన్నారు. జిల్లా క్రీడాకారులు శిక్షణ కోసం కావాల్సిన సదుపాయాలు యూనిఫామ్ జెన్ అకాడమి అందిస్తుందని జిల్లా జూడో సంఘం కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సురేష్, సురేష్ నంద, పిఈటి వాణి, వెంకటమునిలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## తిరుపతి నగర ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు

### కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 15, ప్రభాతవార్త** తుఫాన్ ప్రభావంతో తిరుపతి నగర ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకున్నామని నగర కమీషనర్ ఎన్. మౌర్య తెలిపారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రత్యామ్నాయంగా చేసిన ఏర్పాట్లు గురిం ఆమె విలేకరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న మరో మూడు రోజులు పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం వుందన్నారు. ఈ వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా వున్నామన్నారు. అలాగే ప్రజలకు ఈ వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బంది వున్నా మురికి నీటి కాల్వలు పొంగి పొంగి పొర్లినా హెల్ప్ లైన్ 087722 56766కి పిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా వర్షపు నీరు ఎక్కువగా నిల్వ వుండే ప్రాంతాల్లోను, లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఎక్కడైనా కాలనీల్లో మురుగు నీరు కాల్వల్లో పొంగి పొర్లకుండా ఎక్కడికక్కడ చెత్త తొలిగిస్తూ తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలకు సాయం అందించేందుకు 30 మందితో కూడిన ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉన్నారని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమకు సమాచారం ఇస్తే వెంటనే వచ్చి సాయం అందిస్తామని అన్నారు.

## ఘనంగా పల్లె పండుగ వారోత్సవాలు

**పాకాల, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



పాకాల మండలంలోని పాకాల, దామలచెరువు పంచా యితీలలో గల పోలిశెట్టివారి పల్లి, రాజీవ్ కాలనీ, మౌలాలిపేటలలో 2కోట్ల 65 లక్షల రూపాయిల నిధులతో జరుగు పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో డ్రైనేజీ కాలువ పనుల కొరకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటూ త్వరలో స్థానికంగా పెద్ద ఎత్తున పెట్టుబడుల వస్తున్నాయని తద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు కావాల్సిన, మౌలిక సదుపాయాలు కల్పన దిశగా ముందుకు వెళ్తున్నామని తగు కార్చాచరణ త్వరలో సిద్ధం చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఎన్‌డిఏ కూటమి పార్టీల నాయకులు, మహిళలు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైకల్యాలపై అవగాహన ర్యాలీ



**చంద్రగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై భవిత సెంటర్ ఆధ్వర్యంలో మంగళ వారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీ పద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన వారిలోని లోపా లను వివరించారు. 5 రకాల లోపాలను వివరించిన ఆయన వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా అధిగ మించవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు ఐఈడిఎస్ఎస్ టీచర్ కె.ఉదయ్ కుమార్, భవిత టీచర్స్ ఎస్.శ్యామలాదేవి, ఎన్.వెంకట రాజేశ్వరి, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర "పుస్తకావిష్కరణ"

**చంద్రగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**



చంద్రగిరి మాజీ శాసన సభ్యురాలు గల్లా అరుణకుమారి స్వీయ చరిత్రపై రూపొందిన పుస్తక ఆవిష్కరణ మంగళవారం చంద్రగిరి మండల మాజీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మునిరెడ్డి చేతులమీదుగా చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆమె చేసిన ప్రజాసేవలను కొనియాడారు. అవినీతి రహిత పాలనకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. అదేవిధంగా వైసిపి జిల్లా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, రాయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అధినేత చేగు ప్రశాంత్ గుప్తా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అభిమానులు కలిగిన నాయకురాలు గల్లా అరుణకుమారి అన్నారు. ఆమె స్వీయ చరిత్ర పుస్తక రూపంలో రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ అధికారిగా తరుణాక్షరెడ్డి బాధ్యతలు

**సత్యవేడు, అక్టోబరు 15 ప్రభాతవార్త:**



సత్యవేడు పంచాయతీరాజ్ విస్తరణ అధికారిగా తరుణాక్షరెడ్డి బాధ్యతలు స్వీకరిం చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్ర శేఖర్ సమక్షంలో ఈవోఅండ్‌ఆర్‌డీగా తరుణాక్షరెడ్డి బాధ్యతలు స్వీకరించడం జరి గింది. గత కొంత కాలంగా సత్యవేడు పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న ముని రవికుమార్ ఈవోఅండ్‌ఆర్‌డీగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేపథ్యం లో సాధారణ బదిలీల్లో భాగంగా తొట్టంబేడు ఈవోఅండ్‌ఆర్‌డీగా పని చేసిన తరు ణాక్షరెడ్డి ఇక్కడికి వచ్చారు. పంచాయతీరాజ్ విస్తరణ అధికారిగా తరుణాక్షరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

## పల్లెల ప్రగతి టీడీపీకే సాధ్యం



**సత్యవేడు, అక్టోబరు 15 ప్రభాతవార్త:** పల్లెలు ప్రగతి టీడీపీకే సాధ్యమని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు పేర్కొన్నారు. కేవీబీ పురం మండలం కండ్లూరు, బ్రాహ్మణపల్లి, ఆదరం గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపతిబాబు మా ట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు, విద్యాభివృద్ధి, పంచాయతీల అభి వృద్ధిప్రధాన అజెండగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని తెలి పారు. టీడీపీ పార్టీ ఎంతో క్రమశిక్షణతో ఉందని, అదే విధంగా ప్రభుత్వం లో కూడా ఎక్కడ అవకతవకలు లేకుండా అభివృద్ధి ప్రధానంగా ముందు కెళుతుందని తెలిపారు. అనంతరం గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్ర మాలకు భూమిపూజ చేశారు. టీడీపీ శ్రేణులు, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## హరి ప్రియకు డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి విద్య, అక్టోబర్ 15, ప్రభాతవార్త:**

పద్మావతి మహిళా వర్సిటీ విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని సి.హరి ప్రియకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు సునీత బాయ్ మార్గదర్శకత్వంలో ఏ స్టడీ ఆఫ్ క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటలిజెన్స్ అండ్ దేయర్ ఎఫెక్ట్ ఆన్ అకాడమిక్ అచీమ్మెంట్ఇన్‌సైన్స్ ఆఫ్‌సెకండరీస్కూల్‌స్టూడెంట్స్ అనేఅంశంపైపరిశోధనసమర్పించి నం దుకుగానుఆమెకు డాక్టరేట్ లభించిందని వర్సిటీ డీన్ ఆఫ్ ఎక్స్ మినేషన్స్ ఆచార్య జీవన జ్యోతి తెలిపారు.

## యస్వీయూలో పిజి కోర్సులకు స్పాట్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

**తిరుపతి విద్య, అక్టోబర్ 15, ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, ఎం.కామ్, ఎం. యస్సీ, కోర్సుల్లో ఖాళీగా వున్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లను గడువు తేదీలు పొడిగిస్తున్నట్లు యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం యస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల కార్యాలయంలో 14-10-2024, 21-10-2024 తేదీల్లో ఎక్కడా సీటు పొందిన, పి.జి సెట్ 2024లో ర్యాంకు పొందిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు పొందవచ్చని కోరారు. మరిన్ని వివరాలకు డి.ఓ.ఏ.డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబును(0877-2248589)సంప్రదించాలని కోరారు.

## రైతుల ప్రయోజనానికే ఈ క్రాప్ నమోదు

### - జిల్లా ఏవో ప్రసాద్‌రావు



**వడమాలపేట, అక్టోబరు 15 ప్రభాతవార్త:**

రైతుల ప్రయోజనానికే ఈ క్రాప్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికా రిప్రసాద్‌రావు పేర్కొన్నారు. మంగళవారం వడమా లపేట మండలం పాదిరేడులో ఈ క్రాప్ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహిస్తుండగా ఆయన ఆకస్మికంగా వచ్చి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఖరీఫ్-2024 సీజన్‌లో ఈ పంటలో నమోదు చేసిన రైతులకు ఈ సామాజిక తనిఖీలో సందేహాలు ఉంటే గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి మార్చుకోవచ్చని తెలిపారు. వడమాలపేట మండలంలో 2227 మంది రైతులకు 6177 ఎకరాల్లో పంటల సాగు, ఈ క్రాప్ పూర్తి చేయడం జరిగిందన్నారు. మండలంలోని గ్రామాల్లో అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం, గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ గ్రామసభల్లో రైతు సేవాకేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల క్రాప్‌నమోదు అన్ని వివరాలను సమగ్రంగా చదివి వినిపించడం జరుగుతుందని, భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడిన ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ, అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.విజయకుమార్, ఆర్‌బీకేలు, రైతులు పాల్గొన్నారు.

## పల్లె పండుగలో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ

**కేవీబీ పురం, అక్టోబరు 15 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తలపెట్టిన పల్లె పండుగ వారోత్సవాలు కేవీబీ పురం మండలంలోని కాళంగి, ఆదరం కండ్లూరు, బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీల్లో మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగాహాజరైన టీడీపీ నేత శ్రీపతిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతిపల్లె అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆధార్ లేని గిరిజనులకు ఆధార్ కార్డులు : కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో తహసిల్దార్లు, ఎంపిడిఓలు సమన్వయం చేసుకుని ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం జిల్లాలోని అర్డీఓలు, ఎంపిడిఓలు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు అవసరం అన్నారు. జిల్లాలో ఆధార్ కార్డు లేని గిరిజనులను గుర్తించి వారికి ఆధార్ కార్డు మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆధార్ కార్డు మంజూరు కోసం మొదట జనన ధృవీకరణ పత్రం అవసరం అని, ఇది లేని వారికి ఎంపిడిఓలు జనన ధృవీకరణ పత్రంను మంజూరు చేయాలన్నారు. అలాగే సంచార ఆధార్ కార్డు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆధార్ కార్డులు లేని గిరిజనులను గుర్తించి వారికి ఆధార్ కార్డు మంజూరు చేయాలన్నారు. అలాగే జనన ధృవీకరణ పత్రం లేని వారికి ఎంపిడిఓలు నిర్ధారించి సర్టిఫికేట్లు జారీ చేయాలన్నారు. విఆర్ఓలు, పంచాయతీ సెక్రటరీలు సచివాలయ పరిధిలో ఆధార్ నమోదు, ఆధార్ కార్డులు లేని గిరిజనులను గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు. ఆధార్ కార్డు పొందితే దీని ద్వారా రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, పెన్షన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఎస్.మూర్తి, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, డిఎల్‌డిఓ రవికుమార్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అర్డీఓలు, తహసిల్దార్లు ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## పొంగుతున్న వాగును పరిశీలించిన అర్డీఓ



శ్రీరంగరాజపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: తుఫాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలో గిద్దమాకురాజపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వాదును మంగళవారం చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా అర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, తుఫాను సందర్భంగా మండల పరిధిలో తీసుకుంటున్న చర్యలను తహసిల్దారు లోకనాధపిళ్ళైను అర్డీఓ అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు–పుత్తూరు పాత రోడ్డులో ఆక్రమణలపై రెండు రోజుల్లో పరిశీలించి నివేదికలు పంపాలని తహసిల్దారు లోకనాధపిళ్ళైను అర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు.

## తుఫాన్ ముందస్తు చర్యలను పరిశీలించిన సీజీఎం

గూడూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనంలో భాగంగా మూడు రోజుల పాటు ఏపిలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్, ఉమ్మడి నెల్లూరు జిల్లా సైక్లోన్ నోడల్ ఆఫీసర్ కె. ఆదిశేషయ్య పేర్కొన్నారు. మంగళవారం అల్పపీడనం ప్రభావం పై తుఫాన్ ముందస్తు చర్యలు చేపట్టి సహాయ కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా మనుబోలు సెక్షన్ ఆఫీస్‌లో సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్‌ను అడిగి ముందస్తు చర్యల గురించి తెలుసుకున్నారు. తరువాత గూడూరు డివిజన్ ఆఫీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్ర రెడ్డితో గూడూరు డివిజన్‌లో తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లోన్ ముందస్తు చర్యలు అన్ని చేపట్టారని ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే చర్యలు చేపట్టేందుకు సిబ్బందిని అందుబాటులోకి ఉంచుకోవాలని తెలిపారు. పోల్స్ ముందుగానే సెక్షన్ ఆఫీస్‌లల్లో ఉంచుకోవాలని తెలిపారు. సెల్ ఫోన్లు చార్జింగ్ ఉంచుకోవాలని కమ్యూనికేషన్ చాలా ముఖ్యమని తెలిపారు. వినియోగదారులు ఏ సమస్య వచ్చిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు గానీ టోల్‌ఫ్రీ నెంబర్స్ 1912కు, 1800425155333కు కానీ, వాట్సాప్ నెంబర్ 9133331912కు తెలపవచ్చుని తెలిపారు. టీమ్స్ ఎక్కువగా ఏర్పాటు చేసుకోవాలని మ్యాన్ పవర్ ఎక్కువగా ఉంచుకోవాలన్నారు. అనంతరం చిల్లకూరు సబ్ స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసారు. అనంతరం కోట సబ్ డివిజన్ అధికారులతో రివ్యూ మీటింగ్‌లో పాల్గొని పలు సమస్యలపై చర్చించి తుఫాన్ ప్రభావం వల్లతీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ పర్యటనలో గూడూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్ర రెడ్డి, గూడూరు టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, కోట సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. చిన్నయ్య, మనుబోలు అసిస్టెంట్ ఇంజనీర్ అనిల్, చిల్లకూరు అసిస్టెంట్ ఇంజనీర్ శేషాద్రి, పోలయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే ప్రభుత్వం వచ్చింది : ఎమ్మెల్యే



శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త : 'ప్రజల్ని దోచుకునే ప్రభుత్వానికి కాలం చెల్లిందని నేడు ప్రజల కోసం ప్రజలు కోరుకునే అభివృద్ధిని అందించే ప్రభుత్వం వచ్చిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం లోని బివి పురం గిరిజన కాలనీ, సుబ్బానాయుడు కండ్రిగ గ్రామాల్లో ఎంపిడిఓ రఫీ ఖాన్ అధ్యక్షతన 'పల్లె పండగ' కార్యక్రమాలను ఏర్పాటు చేయగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సభల్లో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నిధుల సాధనలో పరుగులు తీస్తూ కేంద్రం నుంచి సాధిస్తుంటే పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి డెప్యూటీ ముఖ్యమంత్రి పల్లెల ప్రగతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. గతంలో పరిపాలించిన వారు రాజకీయ వ్యాపారం సాగిస్తే నేడు పల్లెల ప్రగతికి పురోభివృద్ధికి జవాబుదారి తనంతో పని చేస్తున్నామని వివరించారు. గ్రామాల్లో అభివృద్ధిని ప్రజలకు చూపాలనే లక్ష్యంతో నిధులు మంజూరు చేసి 'పల్లెపండగ వారోత్సవాలను' రూపకల్పన చేసిందన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని 24 పంచాయతీలకు మొదటి విడతలో రూ.2కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. మొదటి దశలో మంజూరు చేసిన పంచాయతీల్లో ఒక్కొక్క పంచాయతీకి రూ.10లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలను చేపట్టనున్నట్లు వివరించారు. ప్రజల సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించుటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**శంకుస్థాపనలు:**

మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా బివి పురం, సుబ్బానాయుడు కండ్రిగ గ్రామాల్లో రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్‌లు రంగినేని చెంచయ్యానాయుడు, పాపిరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్, దొరైరాజ్, గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, చంద్ర, మునిశేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ సంఘం అధ్యక్షుడు రవిరాజుకు సన్మానం



తిరుపతి, అక్టోబరు 15 ప్రభాతవార్త : పట్టణంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, ఏరియా కోఆర్డినేటర్ కోనేటి రవిరాజును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. శాలువా, జ్ఞాపిక బహుకరించి సత్కరించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తే బిపి, షుగర్ వ్యాధులను నియంత్రణలో వుంచడంతో పాటు పలు ఇతర రకాల వ్యాధులు దరి చేరవని తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి ఆరోగ్య సూత్రమైన నడక వ్యాయామం కోసం ప్రజల్లో అవగాహన తీసుకురావడంతో రవిరాజు కృతకృత్యులయ్యారని ప్రశంసించారు. వివిధ రకాల వ్యాధుల వైద్య నిపుణులు, పలు ఆస్పత్రుల సంయుక్త సహకారంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. అనంతరం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో 250 మంది వాకర్స్ సభ్యులకు 500 రూపాయల విలువ చేసే మెడికల్ కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్ట్ ఎవిపి సుధాకర్‌రెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, రీజనల్ కౌన్సిలర్ జె.ఆర్.ప్రతాప్, వివిధ ప్రాంతాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి రోటరీక్లబ్ సన్మానం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న ఊరందూరు జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కూనాటి సురేష్‌ను పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రోటరీ అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి సిద్దులుగారి ప్రసాద్, జిల్లా గవర్నర్ చేతుల మీదుగా సమక్షంలో సురేష్‌ను ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ ఎంతో మంది ఉపాధ్యాయులను తీర్చిదిద్దిన ఘనత సురేష్‌కు దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు రోటరీసభ్యులు పాల్గొన్నారు. కాగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో జరిగిన బాలబాలికల యువత కార్యకలాపాల పోటీల్లో విజేతలైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు మెమొంటోలు మరియు బహుమతులను భరద్వాజ వృద్ధాశ్రమం వారికి రోటరీక్లబ్ తరపున ఓవీల్‌ఛైర్ మరియు నెబులైజర్‌లను అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప పడిపూజ



నగరి, అక్టోబరు 15 ప్రభాతవార్త: పట్టణ పరిధి బైపాస్ కూడలిలో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు పుష్పాలతో ఆలయాన్ని, అయ్యప్ప స్వామిని నేత్రపర్వంగా అలంకరించారు. అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలుచేయడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయంతో పాటు ప్రాకారమంతా అయ్యప్ప భక్తులతో నిండిపోయింది. పుష్పాలంకరణలో సుందరంగా కనిపించిన అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపారు. 18 పడికెట్లపై వెలిగించిన నెయ్యి దీపాలను దర్శించుకుని మొక్కుకున్నారు. పుష్పార్చన పూజకు వాడిన పుష్పాలను, తులసిని మహిళలు భక్తిశ్రద్ధలతో ఇళ్ళకు తీసుకెళ్లారు. పూజలో భాగంగా మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి కన్నప్ప భక్తులు మునస్వామి, రమేష్‌బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వడమాలపేటలో విద్యార్థులతో ర్యాలీ



వడమాలపేట, అక్టోబరు 15 ప్రభాతవార్త: భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యాస వైఫల్యాలపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన ఈ ర్యాలీలో మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, తులసిరాంలు పాల్గొని మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యసనలో ఐదు రకాలకు సంబంధించి లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్ద వచ్చునని విద్యార్థులకు తెలియజేశారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు కరుణ నవనీతం భవితసెంటర్ ఉపాధ్యాయులు హేమలత, విజయకుమారి, కుమారి, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్నాటక అక్రమ మద్యం స్వాధీనం - ఒక వ్యక్తి అరెస్టు

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: చిత్తూరు తాలుకా పోలీసులు చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ జి.రమేష్‌బాబు, సిబ్బంది మంగళవారం 15 కేసుల కర్నాటక మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడు శివను అరెస్టు చేసి కర్నాటక నుండి అక్రమ మద్యం తరలించడానికి వినియోగించిన 3 లక్షల రూపాయల విలువైన వాహనంను సీజ్ చేశారు. కర్నాటక అక్రమ మద్యం రవాణా సమాచారం పోలీసులకు అందడంతో ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ జి.రమేష్ బాబులు సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం చిత్తూరు రూరల్ మండలం నరిగపల్లి గ్రామం నుండి కన్నికాపురం గ్రామం వైపుగా అనుమానస్పదంగా వస్తున్న ఒక టాటా ఇండియా కారును అదుపులోకి తీసుకున్నారు.

## జనావాసాల మధ్య మద్యం షాపు వద్దు!..ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళనలు



ఎక్సైజ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మద్యం షాపులు వద్దంటే వద్దని మహిళలు ఆందోళనలు చేపట్టారు. మూడు రోజులుగా గ్రూప్ థియేటర్ల వద్ద మద్యం షాపును ఏర్పాటు చేయవద్దని మహిళలు మంగళవారం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సిఐ లావణ్యకు వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తిలోని మున్సిపల్ కూరగాలయ మార్కెట్ సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. అయితే ఈ ప్రాంతంలో నివాసాలు అధికమయ్యాయి. అయితే ఇక్కడ మద్యం షాపుల వల్ల ద్విచక్రవాహనాలు ఇళ్ళ ముందు పార్కింగ్ చేయటమే కాకుండా మలమూత్రాలు విసర్జిస్తున్నారు. ఇరుకు రోడ్డుపై మద్యం షాపు వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కల్గుతుందన్నారు. అంతేకాక సమీపంలో కూరగాయల మార్కెట్ ఉండటం వల్ల ఈ ప్రాంతం నుంచి మహిళలు వెళ్ళాల్సి ఉందన్నారు. వీధుల్లో ఆకతాయిలు ఇళ్ళ ముందు బైఠాయించి దూషించుకుంటూ కొట్లాడుకుంటూ ఇబ్బంది కల్గిస్తున్నారని తమ బాధలను వివరించారు. ఇక ఈ మార్గం గుండా వాహనాలను అనుమతిం చటంతో నిత్యం రాకపోకలకు ఇబ్బంది కల్గుతుందని సిఐకు వివరించారు. గతంలో కూడా తాము ఎన్నో సార్లు ఆందోళనలు చేసినట్లు వివరించారు. ఈ ఆందోళన కార్యక్రమాలను డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, చెంచురెడ్డిల సారధ్యంలో భారీ ఎత్తున మహిళలు ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేసారు. అధికారులకు వినతి పత్రం అందించారు.

**అన్నా క్యాంటిన్ పక్కన షాపు వద్దు:**

శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నది ఒడ్డున అన్నా క్యాంటిన్‌ను ఏర్పాటు చేసారు. ఇక్కడే తిరుపతి నుంచి వచ్చే ఆర్‌టిసి బస్సుల్లో ఆలయానికి వెళ్ళు భక్తులను దించుతున్నారు. ఇక్కడ మద్యం షాపు ఉండటం వల్ల ఇబ్బందిగా మారుతుంది. ఇటు భక్తులు అన్నా క్యాటిన్‌లో భోజనాలు చేసే వారికి ఇబ్బందిగా మారింది. నాలుగుమాడావీధుల్లో మద్యం షాపులు ఉండరాదని గతంలో శాసనసభ్యుడుగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నిర్ణయించారు. ఆయన ఆశయాలను ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఆచరిస్తారా? లేదా? అనేది వేచి చూడాలి

## వివాహిత ఆత్మహత్యపై అధికారులు సమగ్ర విచారణ

దక్కిలి, అక్టోబరు 15 ప్రభాతవార్త: మండలంలోని దందవోలు గ్రామానికి చెందిన ఏకోలు చెంచులక్ష్మీ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను మంగళవారం నెల్లూరు జిల్లా ఐటీడీఏ పీవో పరిమళ, తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ దక్కిలి తహశీల్దారు శ్రీనివాసులు మంగళవారం గ్రామంలో విచారించారు. మృతురాలు గిరిజన కుటుంబానికి చెందిన మహిళ కావడంతో ఆమెకు ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు చెందిన అధికారులు దందవోలు గ్రామంలో మృతురాలు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహశీల్దారు విలేకరులతో మాట్లాడుతూ చెంచులక్ష్మీ కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు విచారణ చేసి, బంధువుల నుంచి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేసినట్లు చెప్పారు. గిరిజన కుటుంబాన్నీ ఆదుకునేందుకు తిరుపతి జిల్లా అధికారులు కూడా సాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లిఖార్జునరావు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లిఖార్జున, జైభారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి తలారి నాగరాజు, నవజీవన్ ఆర్గనైజేషన్ సభ్యుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి : షార్ మాజీ డైరెక్టర్



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త : మిసైల్ మెన్, భారత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని షార్ మాజీ డైరెక్టర్ కె.నారాయణ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం కష్టపడి ఉన్నతస్థాయికి ఎదిగారని, ఆయన స్ఫూర్తి నేటి విద్యార్థులకు ఎంతో అవసరమని తెలిపారు. తన పూర్వ సహచరుడుగా ఆయనతో కలిసి పని చేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 1963లో ఆయన ఇస్రోలో చేరానని, తాను 1967లో ఇస్రోలో చేరానని, ఇద్దరం కలిసి పనిచేశామని తెలిపారు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ నేతృత్వంలో తాము పనిచేసిన విషయాలను ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం కలాం విగ్రహానికి పలువురు నివాళి అర్పించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, వారికి నారాయణ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె ఉస్మాన్‌బాషా, వీరయ్య, ఆదినారాయణరెడ్డి, హరినారాయణరెడ్డి, గురుస్వామి, హెడ్మాస్టర్ శ్రీనివాసులు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జాలర్లు సముద్రంలో వేటకు వెళ్లొద్దు : ఆర్డీఓ



తడ, అక్టోబర్ 15 ప్రభాతవార్త : తుపాను నేపథ్యంలో జాలర్లు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లకూడదని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి అన్నారు. తడ మండలం బివిపాలెం పాతకుప్పంలో మంగళవారం ఆమె జాలర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జాలర్లు సురక్షితంగా ఇళ్ల వద్ద ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తుఫాను విపత్తుపై మండల శాఖ అధికారులతో సమీక్ష

## అందరి సహకారంతో విజయవంతం చేద్దాం : సైక్లోన్ స్పెషల్ ఆఫీసర్



దొరవారిసత్రం, అక్టోబర్ 15 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండల సర్వసభ్య సమావేశ మందిరంలో మంగళవారం మండల శాఖ అధికారులకు ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సైక్లోన్ స్పెషల్ ఆఫీసర్ పిడి డిఆర్‌డిఏ శోభన బాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సైక్లోన్ కదలికలపై గ్రామస్తులకు తెలియజేస్తూ వారికి అండగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా దొరవారిసత్రం సమీపంలో ఎక్కడ కూడా తుఫాను ప్రభావం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టంగానీ జరగకుండా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాల నుండి తుఫానుగా మారి వరద ప్రభావం ఉంటుందని దీనిపై ప్రతి అధికారి అందుబాటులో ఉండాలని తెలియజేశారు. అనంతరం మండల శాఖ అధికారుల నుండి ఆయా గ్రామాల స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు విపత్తు నుండి తీసుకోవాల్సిన చర్యలను మండల శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. వీరితో పాటు మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, తహశీల్దార్ శైల కుమారి, ఏవో రఘురామయ్య, వెటర్నరీ అధికారి శ్రీదేవి, ఎలక్ట్రికల్ ఏఈ జగదీశ్వర రావు, ఏపిఎం మునిరాజా, రాజా రెడ్డి తదితరలు ఉన్నారు.

## పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త : తుఫాను నేపథ్యంలో నగర పాలక సంస్థ పరిధిలో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలను కోరారు. నగరంలోని 17 ప్రాంతాల్లో ఈ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ కాలనీలోని పార్వతీపురం, నగర పాలక సంస్థ పాఠశాల, మంగళం తుడా క్వార్టర్స్ వద్ద గల ఎంపిపి స్కూల్, కొత్తపల్లి, ప్రైమరీ స్కూల్, కొరమేనుగుంట రాజీవ్ గాంధీ స్కూల్, ఆర్ఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మధురానగర్‌లోని ఎంసియుపి స్కూల్, మదురానగర్ లోని ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్, సంజయ్ గాంధీ కాలనీలోని ఎంయుపి స్కూల్, సత్య నారాయణ పురంలోని జడ్పి స్కూల్, కెనడి నగర్‌లోని డి అడిక్షన్ సెంటర్, ఎర్రమిట్ట లోని రత్నం, చైతన్య స్కూల్, సింగాల గుంట మున్సిపల్ స్కూల్, ఉప్పంగి హరిజనవాడ మున్సిపల్ స్కూల్, యశోదా నగర్‌లోని లిటిల్ ఎంజెల్ స్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్, ఎల్‌బి నగర్‌లోని కేశవరెడ్డి స్కూల్, వేశాలమ్మ గుడి వీధిలోని ఇందిరా నగర్ స్కూల్‌లలో ఏర్పాటు చేసామన్నారు. కేంద్రాలను ఇన్చార్జి అధికారులను నియమించామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడ్డా హెల్ప్ లైన్ నంబర్ 0877 2256766ను సంప్రదించాలని కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు.

## ఘనంగా అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ట



సదుం, అక్టోబరు 15 ప్రభాతవార్త : మండల పరిదిలో ఇటీవల కొత్తగా నిర్మించిన రెండు దేవాలయాలలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఊటుపల్లె పంచాయతీ పరిదిలోని పుట్టావారిపల్లెలో నిర్మించిన శ్రీ విరూపాక్షమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా నడిగడ్డ పంచాయతీ మాదిగపల్లెలో శ్రీశ్రీశ్రీ మాతమ్మ గుడిలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఆలయాల వద్ద గణపతి పూజ, పుణ్యహవచనం, స్వస్తివాచనం, నవగ్రహ శాంతి హోమం జరిపించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకం పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. 101 కళశాలతో ఆలయాలపై కళశాలలకు మంత్రజలంతో అభిషేకించారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి కుంకుమను భక్తులకు అందించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## బంగారు నగల కోసం మహిళపై కత్తితో దాడి

రొంపిచెర్ల, అక్టోబరు 15 ప్రభాతవార్త : మండల పరిదిలో బంగారు నగల కోసం ఒక యువకుడు మహిళపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన రొంపిచెర్ల మండలంలో జరిగింది. రొంపిచెర్ల మండలం వారణాసివారిపల్లెకుచెందిన శ్రీనివాసులు భార్య రోజా(30) మంగళవారం మధ్యాహ్నం పశువులను మేపుకునేందుకు సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లింది. ఆవుల వద్ద ఒక్కటే ఉన్నదని గ్రహించిన అదే గ్రామానికి చెందిన ప్రవీణ్(21) బంగారు నగల కోసం కత్తితో ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను చికిత్స కోసంప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెడపైన చేతుల మీద కత్తితో నరకడంతో దాదాపు 80 కుట్లుపడ్డాయి. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు.

## పేదరికం లేని సమాజ స్థాపనే సిఎం చంద్రబాబు లక్ష్యం

**- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం(గుడుపల్లె), అక్టోబర్ 15 ప్రభాతవార్త : పేదరికం లేని సమాజ స్థాపనే సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గుడుపల్లె మండల కమ్మగుట్టపల్లి గ్రామంలో పల్లె పండగ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నూతన సిసి రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఇతర నియోజకవర్గాల కంటే కుప్పం అభివృద్ధికి మూడు రెట్ల నిధులు అధికంగా కేటాయించారన్నారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని అందుకు గాను గ్రామాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం సిఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటోందన్నారు. కుప్పానికి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే కాకుండా ఉంటే కుప్పం అభివృద్ధి చెందేదా అని ప్రశ్నించారు. కుప్పం ప్రాంత యువత కోసం రానున్న రోజుల్లో పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండువేల ఎకరాల్లో సెజ్‌ను ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. పూర్‌టురిచ్ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆర్థిక ప్రమాణాలు పెంచేందుకు చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు శ్రీనివాసులు, సుబ్బు, జనసేన కోఆర్డినేటర్ నరేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్టు

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ఎంఎంపురం ఆదిఆంధ్రవాడకు చెందిన కుమారి అనే మహిళ కుమార్తె మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెప్టెంబర్ 6వ తేదీ తన కుమార్తె కన్పించడం లేదని కుమారి అనే మహిళ ఫిర్యాదు చేసిందని ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు కుమారి దూరపు బంధువు పాకాల మండలానికి చెందిన కోటి అనే వ్యక్తి ఆమె కుమార్తెను బలవంతంగా తీసుకెళ్ళినట్లు తేలిందని ఎస్ఐ సుమన్ తెలిపారు. కోటిని కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప ఆధ్వర్యంలో నిందితుడి కోటిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ సుమన్ పేర్కొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన జిల్లా అటవీ అధికారి వివేక్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌ను జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వడమలాపేట విద్యార్థులు

వడమాలపేట, అక్టోబరు 15 ప్రభాతవార్త: వడమాలపేట ఉన్నత పాఠశాలలోచదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. తిరుపతి శ్రీనిఆవస క్రీడాసముదాయంలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 17 ఏళ్ళ లోపు బాల బాలికల జూడో జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఈపోటీల్లో పాల్గొన్న వడమాలపేట విద్యార్థులు భానుప్రకాష్ 10వ తరగతి(50)కిలోలు, మానస 10వ తరగతి(62) కిలోలు, యశ్వంతి 10వ తరగతి(90) కిలోలు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి జూడోపోటీలకు ఎంపికయ్యారు. వీరు ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 20,21 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శ్రీకాళహస్తిలో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఉమ్మడిచిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

**VI SMALL CAUSES COURT BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI**

**MCO. NO. 747 OF 2023**

Petitioner.
Mr. ASHOK KUMAR, S/o. Thanigachalam
Vs
**1.A.M.MUNIRATHANAM MUDHALIAR**
**2.UNITED INDIA Insurance Co Ltd.,**
Respondents.
**To,**
**Mr. A.M. MUNIRATHNAM MUDHALIAR, No. 5-148, N.G.O. COLONY , PUTTUR, CHITTOOR DISTRICT-517583**
Please take notice that in the above case MCOP.NO.747 OF 2023 have been posted for your appearance **on 25-10-2024 at 10.30 A.M.** before the Hon'ble VI Judge , Court of Small Causes, High Court Campus, Chennai -104, Hence you are requested to appear in person or by pleader before the above said court without fail, failing which the matter will be decided on merits in your absence. This is for your kind information.
**(E.GNANAPANDITHAN)-(E.SARASWATHI)**
COUNSELS FOR PETITIONER
gmbgnamam@gmail.com